రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 28, కాకర 20, బీర 28, క్యాబేజీ 10, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 28, దొండ 23, చిక్కుడు 23–40, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 40, ఆలు 21, దోస 15, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 37. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కలర్స్ ఉత్సవ్ మేళా రేపు ఆఖరు

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 సెటప్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కలర్స్ ఉత్సవ్ మేళా పేరుతో ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 సెటప్‌లో పిల్లలకు విజ్ఞానాన్ని పంచే విధంగా ఏర్పాటు చేసిన రాకెట్ లాంచర్, రోవర్, చంద్రుడి దక్షిణ ధృవంతో పాటు ఏలియన్స్‌ను ఏర్పాటు చేసిన తీరు ఎంతో అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయి.ఎంతో అద్భుతంగా శ్రీహరి కోట సెటప్‌తో రూపొందించిన ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 3న ముగుస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

అంతర్మథనంలో అభ్యర్థులు

- ఎల్బీనగర్‌లో త్రిముఖ పోటీ
- గెలుపు అవకాశాలపై ప్రధాన పార్టీ నేతల చర్చలు
- తమకు ఏ డివిజన్లలో ఎక్కువ ఓట్లు పడ్డాయనేదానిపై లెక్కలు



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయి. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలం? అనేది చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పార్టీల అభ్యర్థులు నాయకులు, కార్యకర్తలు డివిజన్ల వారీగా అంచనాలు వేస్తున్నారు. పోలింగ్ తగ్గడం వలన ఎవరికి లాభం ఎవరికి నష్టం అని కూడా అంచనాలు వేస్తూ అభ్యర్థులందరూ అంతర్మథనంలో పడ్డారు. ఓ వైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోపల మాత్రం 3న వెలువడే ఫలితాలు ఎలా ఉంటాయనే ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం మొదలు పోలింగ్ వరకు వచ్చిన ఓటర్ల తీరుని బట్టి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయనే అంచనాలతో ఓట్లు లెక్కలేస్తున్నారు. కూడిక తీసివేతలతో గెలుపు అంతరాన్ని నిర్ణయిస్తున్నారు. మరో వైపు ఎగ్జిట్‌పోల్స్ కొంత మందిలో ఆశలు నింపగా..., మరికొందరు అభ్యర్థులను నిరాశకు గురిచేశాయి.

ఎవరి ధీమాలో వారు..

ఎల్‌బీనగర్‌లో ఎవరికి వారుగా ప్రధాన పార్టీల నాయకులు తమకే విజయావకాశాలు ఉన్నాయని చెప్తున్నారు. ఏ నాయకుడిని పలకరించినా గెలుపు ఓటములపైనే ప్రధానంగా చర్చిస్తున్నారు. సన్నిహితులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపు ఓటముల గురించే అందరూ ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా ఎల్‌బీనగర్‌లో త్రిముఖ పోటీ నెలకొనడంతో ఎవరు ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తారనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీ అభ్యర్థులు విజయం తమదేనన్న ధీమాలో ఉన్నారు.

తగ్గిన పోలింగ్: తారుమారు కానున్న ఫలితాలు

పోలింగ్ శాతం అనుకున్నంతగా పెరగకపోవడంతో తగ్గిన పోలింగ్ సరళి ఎవరిని ఇబ్బంది పెడుతుందనే విషయంపై రాజకీయ వర్గాలో , చర్చ జరుగుతోంది. దీంతో అన్ని పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలను అభ్యర్థులు లెక్కలేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లు పోలిస్తే ఈసారి మనకు ఎక్కడ బలం పెరిగింది? ఎక్కడ తగ్గిందనే విషయమై ఒక అంచనాకు వస్తూ నియోజకవర్గంలో పోలైన ఓట్లు ఆధారంగా గెలుపు అంచనా కొస్తున్నారు. ఈవీఎం బ్యాలెట్‌లో నిక్షిప్తమైన ఓట్లు మాత్రం అసలు గుట్టు 3న తేలనున్నది. దీంతో తుది తీర్పు వెల్లడయ్యే సమయం కోసం అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఎల్‌బీనగర్‌లో 49.07 శాతం పోలింగ్



మొత్తం ఓటర్లు	5,93,712
పురుషులు	3,09,557
మహిళలు	2,84,024
ఇతరులు	131
పోలైన మొత్తం ఓటు	2,91,347
పురుషులు	1,49,827
మహిళలు	1,41,492
ఇతరులు	28
పోలింగ్ శాతం	49.07

చైతన్యపురి: ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 49.07 శాతం ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 573 పోలింగ్ బూత్‌ల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ పూర్తి చేశామన్నారు. ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరగబోయే ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొత్తం ఓట్లు, పోలైన ఓట్లు వివరాలు ఇలా ఉన్నాయి.

మలక్‌పేట ఎమ్మెల్యేపై కేసు నమోదు

సైదాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌పై దాడి ఘటనలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలపై సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి... పోలింగ్ రోజు (గురువారం)న సైదాబాద్ డివిజన్ జాకీర్ హుస్సేన్ కాలనీలోని పోలింగ్ కేంద్రం వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. తనపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల, తయ్యబ్, సుజా తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అక్బర్ గురువారం సాయంత్రం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు ఎమ్మెల్యే సహా అతని అనుచరులపై ఐపీసీ 341, 323, 290, 188, 147 ఆర్ డబ్ల్యూ 34, ఆర్‌పీ యాక్ట్ 131 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయం ఎవరిని వరించేనో?

అభ్యర్థులకే కాదు... బెట్టింగ్‌రాయుళ్లకూ టెన్షన్..టెన్షన్!

దిల్‌సుఖ్‌నగర్: పోలింగ్ పూర్తి కావడంతో అంతటా ప్రశాంతత నెలకొంది. నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉన్న వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎక్కడా కనిపించడం లేదు. పోలింగ్ పూర్తి అయిన వెంటనే బూత్‌ల వారీగా లెక్కలు తెప్పించుకొని రాత్రంతా తమ ముఖ్య నాయకులతో కూర్చొని తమకు పడే ఓట్లపై లెక్కలు వేసుకున్నారు. మనమే గెలువబోతున్నామని పార్టీ నాయకులు చెప్పడంతో సంబురాల్లో మునిగిపోయారు. మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల ప్రధాన పార్టీల అభ్యర్థులు శుక్రవారం ఉదయం నుంచి బూత్‌ల వారీ పోలింగ్ లెక్కలను తెప్పించుకొని ఏజెంట్ల నుంచి తమకు పడే ఓట్ల గురి ఆరా తీశారు. తమకు ఎన్ని ఓట్లు పడి ఉంటాయనే అంచనాలు వేసుకుంటున్నారు. మరికొందరు చిన్నాచితక పార్టీలు, ఇండిపెండెంట్ల అభ్యర్థులు తమ ఓటమిని ముందుగానే నిర్ణయించుకొని మిన్నకుండిపోయారు. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ఇంకా ఒక్కరోజే సమయం ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు, ఆయా పార్టీల ముఖ్యనాయకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

బెట్టింగ్‌లు:

అభ్యర్థుల టెన్షన్ అలా ఉంటే.. మరోవైపు అభ్యర్థుల గెలుపు, ఓటములపై జోరుగా బెట్టింగ్‌లు కడుతున్నట్టు సమాచారం. మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే.. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడని బెట్టింగ్‌లు కడుతున్నారు. సామాన్య ప్రజానీకం కూడా ఫలానా పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తాడంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. కొంత రైతే మెజారిటీ ఎంత వస్తుందనే దానిపై కూడా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ప్రధాన నాయకుల మధ్య అయితే..లక్షల్లో బెట్టింగ్ జరుగుతున్నట్టు వినికిడి. గెలుపు కోసం అభ్యర్థి కోట్లది రూపాయలు ఖర్చు చేస్తే.. వారి అనుచరులు, కార్యకర్తలు తాము బెట్టింగ్ కట్టిన డబ్బులు వస్తాయో.. పోతాయో అనే ఆందోళనకు గురవుతున్నట్టు తెలిసింది.

సామ రంగారెడ్డి గెలుపు ఖాయం: పవన్‌కుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో సామ రంగారెడ్డి గెలుపు కోసం, దేశం కోసం, ధర్మం కోసం, పార్టీ కోసం నెల రోజులుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని, కష్టపడి పనిచేసిన కొత్తపేట డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరబోతుందని, ఎమ్మెల్యేగా సామ రంగారెడ్డి మన ముందుకి రాబోతున్నారని అన్నారు. ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్‌లకు పవన్‌కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాశీ వెళ్లిన బీజేపీ అభ్యర్థి సంరెడ్డి



కాశీ విశ్వనాథుడ్ని దర్శించుకున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

సైదాబాద్: ఇరవై రోజుల పాటు అవిశ్రాంతంగా అసెంబ్లీ ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్ రెడ్డి ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో కాశీ విశ్వనాథుడి దర్శనానికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున భార్య శైలజారెడ్డి, కుమారులు సాయి ప్రశాంత్‌రెడ్డి, నితిష్‌రెడ్డితో కలిసి వారణాసికి చేరుకున్నారు. అనంతరం వారు కాశీ విశ్వనాధుని ఆలయం, కాలభైరవ ఆలయం, మృత్యుంజయ ఆలయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20 రోజులుగా ఎన్నికల ప్రక్రియల్లో అలుపు లేకుండా తిరిగామని, అందుకే కుటుంబంతో కలిసి స్వామి వారి దర్శనానికి కాశీ వెళ్లామని ఆయన తెలిపారు. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున శనివారం తిరిగి నగరానికి చేరుకుంటామన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి

కాచిగూడ: తెలంగాణ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య జయంతి సందర్భంగా తెలంగాణ మన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు చొప్పరి శంకర్, వెంకటేశ్వర్లు, పిట్ల నాగేష్, శ్రీనివాసరాజు, సంపత్, సతీష్, నర్సింగ్, వరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

‘వ్యాధిని ద్వేషించండి.. వ్యాధిగ్రస్తులను కాదు’

ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ స్వామి



ఎయిడ్స్ అవగాహన వాక్‌లో పాల్గొన్న కామినేని ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు

మన్సూరాబాద్: ‘ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించండి... వ్యాధిగ్రస్తులను కాదు’ .. అని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ స్వామి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన వాక్ నిర్వహించారు. హాస్పిటల్ ప్రాంగణం నుంచి ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వరకు వాక్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ స్వామి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా 38 మిలియన్ల ప్రజలు హెచ్ఐవీతో జీవిస్తున్నారని, ఈ సంఖ్యను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. తరచూ పరీక్షలతో ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించి, వ్యాధి నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ అంజయ్య, డాక్టర్ హరికిషన్, డాక్టర్ రత్నాచారి, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ సురేష్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీకృష్ణ, మెడికల్, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ చట్టాలపై అవగాహన

- అక్షరలో అంతర్జాతీయ వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

బడంగ్‌పేట్: విద్యార్థులకు విదేశీ చట్టాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు నాదర్‌గుల్ అక్షర స్కూల్‌లో ‘అంతర్జాతీయ దినోత్సవం’ పేరిట శుక్రవారం వేడుకలు నిర్వహించారు. పాఠశాల సీఈఓ మదన్‌మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియా, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, యూఏఈ, ఈజిప్ట్ దేశాలకు సంబంధించిన సంస్కృతి, సాంప్రదాయాలు, వేషధారణ, చారిత్రక కట్టడాలు, ఆహార పదార్థాలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఈఓ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో విదేశాల్లో స్థిరపడే విద్యార్థుల కోసం ఈ వేడుకను నిర్వహిస్తున్నామన్నారు. పాసుపోర్ట్ వెరిఫికేషన్, చెకింగ్ ఎంబసీలు, పరాయి దేశాలకు మన దేశానికి ఉన్న కాలమాన వ్యత్యాసాలు, ఆయా దేశాల్లో ఉన్న నియమాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్ష సోలంకి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌దే విజయం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బ్రహ్మాండమైన ప్రచారాన్ని నిర్వహించారని, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి తీరుతుందని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుధీర్ రెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తన విజయం కోసం ఎంతో కష్టపడ్డారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తారని నమ్మకం తనకు ఉందన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని నంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లడమే తన లక్ష్యమన్నారు. తనను ఓడించడానికి బీజేపీ నేతలు అనేక ఆరోపణలు చేశారని, బీజేపీ 3వ స్థానానికే పరిమితం అవుతుందన్నారు. దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అనే వ్యక్తితో నామినేషన్ వేయించారని, ఈసారి నాది బకెట్ గుర్తు అంటూ ఓటర్లను తప్పుదారి పట్టించడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుట్ర చేశారని ఆరోపించారు. నిరాధారమైన అసత్య ఆరోపణలు చేస్తూ వారు ప్రచారానికి పెద్దపీట వేశారని ఇటువంటి రాజకీయ నాయకులను మార్చాల్సిన అవసరం ఉందని, త్వరలో వారికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. ఎన్నికలలో సహకరించిన నియోజకవర్గ ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మార్పు మొదలైంది: షేక్ అక్బర్



పార్టీ నాయకులతో కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్

మలక్‌పేట: తెలంగాణతో పాటు మలక్‌పేటలో ప్రజలు మార్పు దిశగా అడుగేసి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ప్రీపోల్ సర్వేలు చెబుతున్నాయని ఆ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. అక్బర్‌బాగ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 3న మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామన్నారు. తనకు సహకరించిన పార్టీ నాయకులకు, క్యాడర్ కు, ఓటు వేసిన మలక్‌పేట ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎంఐఎం ఆగడాలను ఎదుర్కొని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడి పార్టీ విజయానికి కృషి చేశారన్నారు. మలక్‌పేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానన్నారు. డివిజన్ల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, గంట్ల కృష్ణ, మహేష్, సీనియర్ నేతలు బోనగిరి చంద్రశేఖర్, బాబు శ్రీను, రవీందర్‌యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, మదన్‌బాబు, అశ్వక్‌ఖాన్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

బడంగ్‌పేట్: పల్లవి, ఆవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్‌నగర్ ఆధ్వర్యంలో ‘రసాజ్ఞ ది నవరస–23’ పేరుతో వార్షికోత్సవాలు నిర్వహించారు. టాలెంట్–21 సీఈవో గురిందర్‌పాల్‌సింగ్, డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వీ, అకాడమిక్ డైరెక్టర్ సుధ తురగ, స్కూల్ డైరెక్టర్ అనితారెడ్డి, ప్రిన్సిపాల్ చారుజైన్ వేడుకలు ప్రారంభించారు. నాటక, క్రీడలు, కరాటేలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. విద్యార్థుల పాటలు, నాటక ప్రదర్శన ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిపేరు చేసిన నెలరోజులకే ఖరాబ్!



హయత్‌నగర్ పాతరోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్

హయత్‌నగర్: హయత్‌నగర్ పాత రోడ్డులో డ్రైనేజీ ట్రంక్‌లైన్ మ్యాన్‌హోల్‌కు రిపేరు చేసిన నెల రోజులకే మరోసారి కుంగిపోయింది. దీంతో ప్రయాణికులకు మరోసారి ఇక్కట్లు తప్పడం లేదు... హయత్‌నగర్ నుంచి తొర్రూరు వైపు వెళ్లే పాతరోడ్డు గత సెప్టెంబర్‌లో కంగిపోయి నడిరోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనికి మరమ్మతు చేసేందుకు సుమారు రెండు నెలలు పట్టింది. గొయ్యితో పాటుగా పక్కనే బలహీనంగా ఉన్న మ్యాన్‌హోళ్లను గుర్తించిన అధికారులు వాటికి కూడా మరమ్మతు చేశారు. ఈ రెండు నెలలూ వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమ్మతులు పూర్తైన నెలరోజుల్లోనే మరోసారి మ్యాన్‌హోల్ కుంగి పోయింది. అప్పుడే రిపేర్ చేసిన మ్యాన్‌హోల్ అంతలోనే కుంగిపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం పనుల కారణంగానే మ్యాన్‌హోల్ కుంగిపోయిందని వెంటనే మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

నువ్వా నేనా..? ఫలితంపై ఉత్కంఠ!



- మహేశ్వరంలో త్రిముఖ పోటీ
- ఎవరు గెలిచినా స్వల్ప అధిక్యమే అంటున్న విశ్లేషకులు
- 55.33 శాతం ఓటింగ్ నమోదు
- రేపు తేలనున్న భవితవ్యం



పట్లోళ్ల సబితారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



అందెల శ్రీరాములు, బీజేపీ అభ్యర్థి



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

మహేశ్వరం: ఘాటైన విమర్శలు.. హోరెత్తించేలా ప్రచారాలు.. ఎవరికి వారే ఓటర్ల ప్రసన్నం కోసం అవస్థలు. ప్రస్తుతం వీటికి శుభం కార్డు పడింది. కచ్చితంగా తామే గెలుస్తామని ధీమాతో మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. తీర్పు ఎలా ఉండబోతుందో.. ప్రజలు ఎవరిని అసెంబ్లీకి పంపిస్తారో అనే ఉత్సుకత తీవ్రమైంది.

ఆ ముగ్గురిలోనే..

నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు పోటీ పడ్డారు. బీఆర్ఎస్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. గత 20 రోజుల నుంచి గ్రామాలు, డివిజన్లు, వార్డులు, బస్తీలలో హోరాహోరి ప్రచారాలు నిర్వహించారు. గెలుపు కోసం ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు. సబితారెడ్డి 2009, 2018లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొంది మంత్రిగా పని చేసి 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్ 2018లో పోటీ చేసి సుమారు 40 వేల ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరంలో తొలిసారిగా పోటీ చేశారు. మూడు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారే ధీమాతో ఉన్నారు.

మందకొడిగా పోలింగ్..

నియోజకవర్గంలో పురుష ఓటర్లు 2,81,203, మహిళా ఓటర్లు 2,65,307 ట్రాన్స్‌జెండర్లు 67 మొత్తం ఓటర్ల సంఖ్య 5,46,577. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 55.09 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం 3,02,365 ఓట్లు పోలై 55.33 శాతం నమోదైంది. హైదరాబాద్‌కు అతిచేరువలో ఉండడం, కొంత భాగం పాత బస్తీలో కలవడం, మరికొంత గ్రామీణ ప్రాంతంలో ఉంటుంది. ఓటింగ్ శాతం తక్కువ నమోదు కావడంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోతుంది.

గెలుపుపై ధీమా..

నియోజకవర్గంలో మూడు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఈ ఎన్నికల్లో తానే గెలుస్తానని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో వేల కోట్ల నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులతో పాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని మంత్రి అన్నారు. బీజేపీ నుంచి పోటీ చేసిన అందెల శ్రీరాములు యాదవ్ గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి తనకు ఈసారి కలిసి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాష్ట్రంలో హస్తం గాలి వీస్తుండడం, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తనకు కలిసివస్తుందని కేఎల్లార్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఎస్పీ నుంచి పోటీ చేసిన కొత్త మనోహర్‌రెడ్డి ఓట్లు చీల్చి ఎవరి గెలుపోటములకు కారణమవుతారో అని మూడు పార్టీల అభ్యర్థులు గుబులు పడుతున్నారు. ఆ సంగ్దిదం వీడాలంటే ఆదివారం సాయంత్రం వరకు ఆగాల్సిందే.

కనీస వసతులు లేక అవస్థలు

- రోడ్లపై పారుతున్న మురుగు
- కంకర తేలిన రోడ్లు
- పట్టించుకోని అధికారులు



సాగర్ రహదారిపై రోడ్డుపై పారుతున్న మురుగు



సాగర్ రహదారిపై బస్టాప్ దగ్గర కంకరతేలిన రోడ్డు



టీచర్స్‌కాలనీలో మరమ్మతుకు నోచుకోని మ్యాన్‌హోల్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో కనీసవసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు విజయవాడ జాతీయ రహదారిపై, ఇటు నాగార్జున సాగర్ రహదారిపై డ్రైనేజీ పొంగిపార్లుతూ ప్రతినిత్యం దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆయాప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ జాతీయరహదారిపై సుష్మా థియేటర్ చౌరస్తా దగ్గర, డీమార్ట్ ముందు ప్రతి నిత్యం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగునీరు గత మూడునెలలుగా రోడ్డుపై పారుతోంది. మరోవైపు నాగర్జున సాగర్ రహదారిపై డ్రైనేజీ పొంగి మురుగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సాగర్‌రోడ్డు పక్కన ఉన్న పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.బస్టాప్ ముందు రోడ్డుపై కంకర తేలి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న మస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



పంచాయతీరాజ్ టీచర్స్‌కాలనీలో రోడ్డు దుస్థితి